## క్లుప్తంగా

### నేడు పెదకాకాని శివాలయంలో హుండీల లెక్కింపు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీల కానుకలు లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. మూడు నెలల హుండీల కానుకల లెక్కింపులో బాగంగా దేవదాయ శాఖ నియమించిన అధికారి పర్యవేక్షణలో హుండీలు తెరవడం జరుగుతుందన్నారు. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం హుండీల లెక్కింపులో భక్తులు పాల్గొనవచ్చని డీసీ తెలియజేశారు. ఈ లెక్కింపులో అర్చకులు, సిబ్బంది పాల్గొంటారన్నారు.

### దళిత బాలిక కుటుంబానికి పరామర్శ

గుంటూరు రూరల్: చేబ్రోలులో అన్యాయంగా ప్రాణాలు కోల్పోయిన దళిత బాలిక కుటుంబాన్ని ఏటుకూరు గ్రామంలో బుధవారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరామర్శించారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వ తరఫున ఆర్థికంగా ఆదుకుంటామని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, కుటుంబానికి అండగా నిలబడతామని మృతి చెందిన బాలిక తండ్రి దావీదుకు హామీ ఇచ్చారు. దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

### బహిరంగ ప్రజావేదికపై ప్రజాభిప్రాయ సేకరణ

పెదకాకాని: మండలంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌పై గురువారం నిర్వహించే బహిరంగ ప్రజావేదికలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఎంపీడీవో బి.వి.మల్లేశ్వరరావు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 12 గ్రామ పంచాయతీలలో ఈ నెల 4వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ సామాజిక తనిఖీ బృందం 16వ విడత సామాజిక తనిఖీ చేయడం జరిగింది. గురువారం ఉదయం 9:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్‌పై జరిగే ప్రజావేదిక కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీవో అన్నారు.

### పెదరావూరు స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు సరెండర్

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు జిల్లా విద్యాశాఖధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బోధించడం లేదంటూ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఇటీవల జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి స్వయంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ అధికారులను నియమించి నివేదిక తెప్పించుకున్న డీఈవో శైలజ సదరు ఉపాధ్యాయుడిని సరెండర్ చేసి, పాఠశాలలో వేరొక ఉపాధ్యాయుడిని తెలుగు బోధించుటకు నియమించినట్లు తెలియజేశారు.

### ప్రొటెక్షన్ కౌన్సిల్ యూత్ విభాగానికి సుధీర్ ఎంపిక

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ దుగ్గిరాల మండల యూత్ అధ్యక్షుడిగా దుగ్గిరాల మండలం పెరికలపూడికి చెందిన మేదర వెంకట సుధీర్‌ను నియమిస్తూ ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు నాదెళ్ల సునీల్, కనపాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

### సాహితీవేత్త పెద్దేటి యోహానుకు సత్కారం



తాడేపల్లిరూరల్: గుర్రం జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకులు, సాహితీరత్న పెద్దేటి యోహానును వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ ప్రముఖ నాటక రచయిత పెద్దేటి యోహానుకు అంతర్జాతీయ ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్, తెలంగాణ సరస్వతి పరిషత్‌లో ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా పద్మ ప్రతిభా పురస్కారం అందుకోవడం గర్వకారణమని చెప్పారు. సన్మానించిన వారిలో అక్షయ సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షురాలు ఉన్నం మేరి సుజాత, కాకా వెంకటేశ్వర్లు ఉన్నారు.

### సచివాలయాల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్, శానిటేషన్ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఎంటీఎంసీ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు. రాబోయే కొన్ని రోజుల్లో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున శానిటేషన్, తాగునీరు సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్ష ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు ఎగ్జిక్యూటివ్ అథారిటీకి తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# సాగుకు సమాయత్తం ఏదీ..?

- రైతు సేవా కేంద్రాల్లో అరకొరగా ఎరువుల నిల్వలు
- పత్తా లేని విత్తనాల జాడ
- పంటల సాగు ప్రారంభమైనా పట్టించుకోని వ్యవసాయ శాఖ
- అయోమయంలో రైతులు
- ఖరీఫ్‌పై నెలకొన్న సందిగ్ధం



మండలంలో పత్తి సాగు చేసిన పొలం

ప్రత్తిపాడు: వర్షాలు పడుతున్నాయి.. వ్యవసాయ పనులూ మొదలయ్యాయి. రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పంటల సాగును కూడా ప్రారంభించారు. కానీ వ్యవసాయ శాఖ మాత్రం ఖరీఫ్‌కు సమాయత్తం కాలేదు. ఖరీఫ్ ప్రారంభం నాటికే విత్తనాలు, ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాల్సిన వ్యవసాయ శాఖ ఇంకా ఇండెట్లు పంపడం వద్దనే ఆగిపోయింది. దీంతో కర్షకులపై ఆర్థిక భారం అధికమవుతుంది. విత్తనాలు మొదలు ఎరువుల వరకు ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

**ఖరీఫ్ అంచనాలు ఇలా...**

ప్రత్తిపాడు మండలంలో గత ఏడాది ఖరీఫ్‌లో సుమారు 17 వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి 1,000 ఎకరాల్లో, పత్తి 3,600 ఎకరాల్లో, మిరప 3,000 ఎకరాల్లో, మినుము 150 ఎకరాల్లో, సోయాబీన్ 100 ఎకరాల్లో సాగు చేసే అవకాశాలున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది. కాగా ఇప్పటికే 800 ఎకరాల్లో వరి ఎద పెట్టగా, 1200 ఎకరాల్లో పత్తి, 10 ఎకరాల్లో మిరప, 25 ఎకరాల్లో మినుము, 23 ఎకరాల్లో సోయాబీన్‌ను సాగు చేశారు.

**కావలసింది కొండంత.. ఉన్నది గోరంత..**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా 250



ప్రత్తిపాడులోని రైతు సేవా కేంద్రంలో అరకొరగా ఉన్న ఎరువులు

మెట్రిక్ టన్నులు, డీఏపీ 100 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 400 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 100 టన్నులు కావలసి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. కానీ రైతు సేవా కేంద్రాల్లో మాత్రం సరిపడా నిల్వలు లేవు. అవి కూడా ఈ ఏడాది ఈ ప్రభుత్వం సరఫరా చేసినవి కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వచ్చినవే.

**ఇంకా ఇండెంట్ల దశలోనే...**

వ్యవసాయ పనులు ఆరంభమైనప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఇంకా ఇండెంట్లు పెట్టడం వద్దనే ఉండిపోయారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సకాలంలో ఎరువులు అందుతాయా? లేదా? అన్న సందేహం రైతులను వెంటాడుతుంది. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి యూరియా, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయించే అవకాశాలు కూడా ఉండటంతో ఏమి చేయాలో పాలుపోక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

**ఇండెంట్లు పెట్టాం**

ఖరీఫ్ సీజన్‌కు కావలసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన ఇండెంట్లను పంపమని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశించడం జరిగింది. వారి ఆదేశాల మేరకు ఇండెంట్లు పెట్టాం. త్వరలోనే స్టాక్ వస్తుంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులను అందిస్తాం.

– అరుణకుమారి (ఏవో, ప్రత్తిపాడు)

# పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం



మురుగు కాలువలో చెత్తను తొలగిస్తున్న కార్మికుడు



ఫాగింగ్ చేస్తున్న కార్మికులు

**శానిటేషన్ విభాగం చర్యలకు ప్రజల హర్షం**

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం లభించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా శానిటేషన్ విభాగం చేపడుతున్న చర్యలకు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 29వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండి, మురుగుతో దుర్గంధం, దోమలతో ప్రజలు సతమతమవుతున్న నేపథ్యంలో సాక్షి పత్రికలో బుధవారం 'అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం.. పట్టించుకోని యంత్రాంగం' అని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయాన్నే పారిశుద్ధ్య కార్మికులు చెత్త, వ్యర్థాలను తొలగించారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్ పర్యవేక్షించారు.

# ఘనంగా మొహర్రం వేడుకలు



పట్టణంలో పీర్ల ఊరేగింపు



డప్పు వాయిద్యాలతో ఊరేగింపు

**పట్టణంలో ఘనంగా పీర్ల ఊరేగింపు**

పొన్నూరు: పొన్నూరులో మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం విశేషంగా అలంకరించిన పీర్లను వైభవంగా ఊరేగించారు. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలో హజరత్ మొహమ్మద్ (స) వారి మనుమలు హజరత్ ఇమామే హసన్, హుసేన్ త్యాగాలను స్మరిస్తూ మొల్లా ముజావర్ కమిటీ ఆధ్వర్యంలో పీర్ల చావిడి నుంచి చిన్న, పెద్ద షరగతులు (పీర్ల) ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో పీర్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొల్లా కరీమ్, హైదర్, గబ్బర్, బాషా, సంధాని, ఖాదర్, మునవార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏకలవ్యుడి జయంతి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్



అన్నదానం చేస్తున్న ఏకలవ్య సంఘం సభ్యులు

పొన్నూరు: శక్తివంతమైన విలు కాడు, మహావీరుడు ఏకలవ్యుడి జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఐలాండ్ సెంటర్‌లోని ఏకలవ్యుడి విగ్రహానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో పాటు టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు.

– పొన్నూరు ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, కోట శ్రీనివాసరావు, గేరా సుబ్బయ్య, కొల్లేరు శ్రీనివాసరావు, నాగసూరి ప్రతాప్, ఎస్టీ నాయకులు దేవరకొండ గోపి, దేవరకొండ కోటయ్య, దేవరకొండ చిన్న గోపి, చంటి, పూల కొట్టు వెంకటేష్, నాగ, నరేంద్ర, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



చేబ్రోలులోని రంగనాథస్వామి దేవస్థానంలో...



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో కోదండరామస్వామి



శలపాడు గ్రామంలో వేణుగోపాలస్వామి

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలు, వడ్లమూడి, శలపాడు, మంచాల, నారాకోడూరు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఏడాది పొడవునా ఉండే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశిగా పాటిస్తారు. విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. పూర్వకాలంలో ఇదే రోజును సంవత్సర ఆరంభంగా పరిగణించేవారని పండితులు చెబుతారు. శలపాడు గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో, మంచాల గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో, చేబ్రోలులోని ఖ్యాతి గాంచిన రంగనాథస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు.

# కేఎల్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో చదివిన 1995– 1999 బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం పూర్వ విద్యార్థులలో స్నేహభావాన్ని పెంపొందించి గత జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి స్ఫూర్తిని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో , రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, పూర్వ విద్యార్థులు సంబంధాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్.కావ్య, ఉద్యోగ కల్పనల డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, సీఎస్ఈ రెగ్యులర్ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

# ఆడపిల్లలు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సిస్టర్ లత

తాడికొండ: మగ పిల్లలతో పాటు దీటుగా ఆడపిల్లలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వారిలో నైపుణ్యాలు పెంపొందించుకుని ముందుకు వెళ్లాలని గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లత అన్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామం ఎస్టీ కాలనీలో బాలల పార్లమెంట్, కిశోర బాలికలకు వృత్తి విద్యా, టెక్నికల్ కోర్సులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిస్టర్ లత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తక్కువ సమయంలో, త్వరగా జీవితంలో స్థిర పడాలంటే ఏ విధమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయనే విషయాలను వివరించారు. మంగళగిరి మండల కో ఆర్డినేటర్ నేలటూరి నాగమణి మాట్లాడుతూ ఆడపిల్లలకు నర్సింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ షార్ట్ కోర్సులతో శిక్షణ పొందాలని సూచించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం అంతా మాట్లాడుకునే వ్యక్తి సునీత విలియమ్స్ కూడా మహిళే అయినా ధైర్యంగా అంతరిక్షంలోకి వెళ్లగలిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది నాగమణి, విజయలక్ష్మి, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

### మద్యం బాబులకు కౌన్సెలింగ్



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం కాజలో విస్తృతంగా పర్యటించి మద్యం బాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రూరల్ ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిరోజు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని, ముఖ్యంగా ప్రజలు సంచరించని ప్రదేశాలు, పంటపొలాల్లో మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, ఇతర మత్తు పదార్థాలు తాగే వారి గురించి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలిఅర్బన్: శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య పుట్టిన రోజును పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం అన్నదానం చేశారు. ముందుగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చుక్కా భానుప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై కోటేశ్వరరావు, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

### సూక్ష్మ రుణాల చెక్కులు పంపిణీ

తెనాలిఅర్బన్: లెప్రా సొసైటీ వారి ఆధ్వర్యంలో తెనాలి డబుల్ హార్స్ సంస్థ సౌజన్యంతో 20 మంది కుష్టు, బోదవ్యాధి గ్రస్తులకు బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని ఫైలేరియా యూనిట్ కార్యాలయం వద్ద సూక్ష్మ రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ తెనాలి డబుల్ హార్స్ సంస్థ సహకారంతో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తుల పిల్లల ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సాయం కూడా చేస్తున్నట్లు చెప్పారు. ప్రతినెల మూడో బుధవారం బోదవ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణ శిబిరం నిర్వహించి వారికి అవసరమైన మందులు, పాదరక్షలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్లు తిరువీధుల శివరామప్రసాద్, దీపాల శ్రీనివాసరావు, వై ఎల్లయ్య, షేక్ బాషిద్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ విద్యార్థినికి ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడుకు చెందిన మెడికల్ విద్యార్థినికి బుధవారం తాడేపల్లిపట్టణ పరిధిలోని రామ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవేంద్రపాడుకు చెందిన మెడికల్ విద్యార్థిని మరీదు వర్ష విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతోందని, హాస్టల్, మెస్‌లకు సంబంధించి ఆరు నెలలకు సరిపడా ఆర్థిక సహాయం అవసరమని తెలియడంతో రూ.60 వేలు సాయం చేస్తానని హామీ ఇచ్చానని, అందులో భాగంగా రూ.10 వేలు అందజేశామని తెలిపారు. ఈ సందర్భం గౌడ సంఘం నాయకులు కంచర్ల కాశయ్య, లచ్చి తులసి దాస్‌లు డాక్టర్ పలగాని శ్రీనివాస్‌ను అభినందించారు.

# ఆర్‌వీఆర్‌జేసీలో అన్ని బ్రాంచీలలో వంద శాతం సీట్లు భర్తీ



ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల

గుంటూరు రూరల్: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏపీ ఎంసెట్ కన్వీనర్ కోటా ఫస్ట్ ఫేస్ అలాట్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేయటం జరిగిందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేనిలు తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి గానూ కళాశాలలోని అన్ని బ్రాంచీలలో వంద శాతం సీట్లు భర్తీ అవ్వటం సంతోషకరమన్నారు. కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్ కోర్సుల్లోనే కాకుండా ఇతర కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగల్లో వంద శాతం సీట్లు భర్తీ కావటం సంతోషకరమని తెలిపారు.

**కిట్స్‌లో నూరు శాతం సీట్ల భర్తీ**

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో నూరు శాతం సీట్లు భర్తీ అయినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ శేఖర్‌లు తెలిపారు. కన్వీనర్ కోటాలో సీఎస్‌సీ, సీఎస్ఎం, సీఎస్‌డీ, ఈసీఈ, ఐటీ, ఈఈఈ విభాగాల్లో నూరు శాతం సీట్లు భర్తీ అయ్యాయన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యార్థులకు బోధన సాగించడం జరుగుతుందని చెప్పారు.

# మంగళగిరిలో ఆషాఢం గోరింటాకు



ఆషాఢం గోరింటాకు కార్యక్రమంలో మహిళలు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో బుధవారం ఆషాఢం గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మమత మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతి అని, గోరింటాకు పెట్టుకోవడం వలన శరీరంలో వేడి తగ్గి చలవ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, మహిళలు ధూళిపూడి పావని, రోహిణి, శిరీష, దాసరి జ్యోతి, భాను, సృజన, ధనలక్ష్మి, రజిత, కృష్ణవేణి, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు.

# అత్యాచార కారకులను కఠినంగా శిక్షించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ



మాట్లాడుతున్న ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి: చేబ్రోలు గ్రామానికి చెందిన దళిత మైనర్ బాలిక పేరుపోగు శైలజపై అత్యాచారం దుర్మార్గమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ రేడియో అండ్ రీడింగ్ రూమ్ ఆవరణలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసి రోజులు గడుస్తున్నా నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కేసు పట్ల పోలీసులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నేత ఉన్నం రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే శైలజ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, ఎకరం సాగు భూమిని అందజేయాలన్నారు. వీరితో మోదుకూరి దావీదు, ఉన్నం చిన్న జాను, ఉన్నం అంతోను, ఉన్నం సన్నీ, ఉన్నం ఇమ్మానుయేలు, ఉన్నం గోపి, గొరికపూడి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కారంచేడు మృత వీరులకు నివాళులర్పించారు.